# కథల్రాయకు

"ఎల్లుండిలోగా కథ రాయకపోతే నీతో ఇంక మాట్లాడం' అన్నారు సుబ్బారావూ, ఆంజనేయులూ.

వాళ్ళిద్దరూ నా స్నేహితులు. ఇద్దరూ కథల్రాస్తారు. ఒకనాడేదో మాటల సందర్భంలో - "నాక్కూడా కథల్రాయాలన్న పిచ్చి కొద్దిగా వుంది" అన్నాను. అప్పట్నించీ పట్టుకున్నారు రాస్తావా ఛస్తావా అని. దాదాపు మూణ్ణెల్లనుంచి వాళ్ళు రోజూ - కథ రాశావా అని అడగడం, నేను 'రాయలేదనడం' ఇలా జరుగుతోంది. రాయలేక్కాదు, రాయదల్చుకుంటే త్వరగానే రాయగలను. కాని రాసేదేదో "మాస్టర్ పీస్" రాశేద్దాం. అందర్నీ అదరగొట్టేద్దాం అని నా తపన. మరి అలాంటి కథ రాయటమంటే మాటలా ! సుబ్బారావుకీ, ఆంజనేయులికీ అది అర్థం కాక, రోజూ నన్ను ఊదరగొట్టేసి చివరికిలా ఫైనల్ వార్నింగిచ్చేశారు.

వాళ్ళిద్దరి కథలూ తరచుగానే వస్తూంటాయ్ పత్రికల్లో. వాళ్ళు రాసినవన్నీ అన్నీ చదవలేదు కాని ఐదారు చదివాను. నాకేం నచ్చలేదు. ఒక ప్రేమ ఉండదు. ఒక త్యాగముండదు, క్లైమాక్స్ వుండదు. అన్నీ ఏడుపుగొట్టు కథలే. ఎంతసేపూ ముష్టి వెధవలూ, కూలీలూ, కార్మికులూ, కిళ్ళీ కొట్టువాడూ, రిక్షాలాగేవాడూ. వీళ్ళ కథలే గానీ మంచి పాత్రలే వుండవు. మురికి పేటలూ, కూలిపోయిన గుడిసెలూ, శవాల్లాంటి మనుషులూ, రోగాలు, రొష్టులూ, వాళ్ళ ఏడుపులూ, మొత్తుకోళ్ళూ - ఎప్పుడూ ఇదే గొడవ. అంతేగాని ఓ అందమైన కుర్రాడూ, అంతకంటే అందమైన కుర్రదీ, హఠాత్తుగా ఎక్కడో కలవడం, ప్రథమ పరిచయంలోనే వాళ్ళ హృదయాల్లో ప్రేమ వికసించడం ఇద్దరూ సరదాగా కారులో షికారు కెళ్ళడం, సడన్‌గా వాళ్ళ పవిత్రప్రేమకేదో అవాంతరం కలగటం, దరిమిలా వాళ్ళిద్దరూ ఒకళ్ళని మించి

మరొకళ్ళు త్యాగాలు చేసి, తమ అమర ప్రేమని నిరూపించుకోవటం, చివరి కిద్దరికీ పెళ్ళయి పోవటం - ఇలాంటి కథలు రాద్దాం, కథంటే ఇలా వుండాలి అని వాళ్ళకి తెలిసినట్లు లేదు. నేనే ఈ సంగతి చాలాసార్లు వాళ్ళతో చెబుదామనుకున్నాను. గాని చెప్పలేదు. మనం ఓ బ్రహ్మాండమైన కథ రాసిపారేస్తే వాళ్ళకే బుద్ధి వస్తుందిలే. అప్పుడైనా తెలుసుకుంటారు అని ఎప్పటికప్పుడు వూరుకున్నాను. కాని వెధవది కథల్రాయడమే ఈ మూణ్ణెల్లనుంచీ కుదిరింది కాదు.

సరే, ఇప్పుడు వాళ్ళెలాగూ ఎల్లుండిలోగా కథ రాసి తీరాలన్నారు గదా. వాళ్ళు హడలి పోయేలా రాశేద్దామనుకున్నాను. వాళ్ళతో హస్క్ కొట్టి ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిదైంది. ఏమైనాసరే ఈ రాత్రి కథ రాశెయ్యాలనుకున్నాను.తీరా ఇంటికొచ్చేసరికి మా ఆవిడ " ముసుగెట్టుకుని పడుకుని - "అబ్బా ! అన్నం మీరే పెట్టుకుందురూ,నేనిప్పుడు లేవలేనూ' అని మూలిగింది. మంచి పని చెయ్యదల్చుకున్నప్పుడన్నీ ఇలాంటి అవాంతరాలే వస్తాయి. చచ్చినట్టు నేనే అన్నం పెట్టుకుని తిన్నాను. బయట వెన్నెల యమాగా ఉంది. చల్లటిగాలి, ఓహో. ఇంతకంటే మంచి సమయమేముందని మా ఆవిణ్ణి మెల్లగా తట్టి బయట హాయిగా వుంది. వెళ్ళి కాసేపు కూర్చుందాం"రమ్మన్నాను.మరి మంచి కథరాయాలంటేఇన్స్పిరేషన్, కావాలి. మధుర భావాలు రావాలి. అందుకే ఆ వెన్నెల్లో పెళ్ళాన్ని ఎదురుగా కూచోబెట్టుకుని ఆమె కళ్ళల్లోకి చూస్తూ మాంచి ప్రేమకథ రాద్దామనుకున్నాను. కాని దురదృష్టమేమిటంటే, నా కవితా హృదయం మా ఆవిడకి అర్థమై చావదు. ముసుగన్నా తియ్యకుండానే "అర్ధరాత్రి ఈ అంకమ్మ శివాలేమిటి, మాట్లాడకుండా పడుకోండి" అని కసిరి, గురకలుగొట్టడం మొదలెట్టింది. నాక్కోపమొచ్చింది. ప్రేమకథ ప్రస్తుతానికి వాయిదా వేసి పాతివ్రత్య ధర్మాన్ని చాటి చెప్పే కథొకటి రాద్దామనుకుని నిశ్చయించుకుని బయటకొచ్చి కూర్చున్నాను. భారత స్త్రీ ఔన్నత్యాన్నిగురించి ఆలోచిస్తుండగా వానొచ్చింది. ఇంట్లోకి పరుగెత్తుకొచ్చేసరికి కరెంట్ పోయింది. ఇంక చేసేది లేక మంచమెక్కాను.

మర్నాడు పొద్దున లేచేసరికి ఎనిమిది. లేవగానే మా ఆవిడ ఫిర్యాదు. పని మనిషి రాలేదని. దాని ఇల్లు దగ్గరేకదా, వెళ్ళి పిల్చుకురమ్మని ఆదేశం కూడా ఇచ్చింది. ఇంక తప్పుతుందా ? మొహం కడుక్కుని కాఫీ తాగి, పనిమనిషి కోసం బయల్దేరాను.

అసలా పేటలో అడుగుపెట్టాలంటేనే నాకు రోత. నేవెళ్ళే సరికి గుడిసె ముందు పని మనిషి పిల్లలు నలుగురూ ఏడుపు మొహాలేసుక్కూర్చున్నారు. "మీ అమ్మేదీ" అని అడిగాను. వాళ్ళ తండ్రి లేడు. రెండేళ్ళ క్రితం పెళ్ళాన్నీ, పిల్లల్నీ వదిలేసి ఇంకెవత్తెనో తీసుకుని ఎక్కడికో పోయాడు. పిల్లల్లో పెద్దవాడు పదేళ్ళవాడు లేచి " మా అమ్మకి రాత్రి నుంచి జొరం బాబూ... మండిపోతాంది... ఇయ్యాల లెగలేదు"... అన్నాడు. చిన్నవాళ్ళిద్దరూ ఏడుపు లంకించుకున్నారు. ఇదెక్కడి న్యూసెన్సని గుడిసె లోపలికి దూరాను.

ఒక కుక్కిమంచం మీ్మద జీవం లేనట్టుగా పడి ఉంది మా పనిమనిషి. "ఎంకీ ఎంకీ ' అని పిలిచాను. కళ్ళు విప్పి చూసింది. మెల్లగా చేతులు జోడించి, ఏదో గొణిగింది. పనిలోకి రాలేనని కాబోలు. కంట తడి కూడా పెట్టింది. నాకు చిరాకేసి బయటకొచ్చేశాను. "దొరా నిన్నటి నించీ ఏం తిన్లేదు. సిన్నోళ్ళిద్దరూ ఏడుత్తున్నారు. ఆకలికాగలేక పోతున్నారు; అన్నాడు పిల్లల్లో పెద్దవాడు. ఈ దరిద్రపు గొట్టు వెధవలకెప్పుడూ ఆకలే. జేబులోంచి ఒక రూపాయి తీసి వాళ్ళ మొహాన కొట్టి గబగబా ఇంటి కొచ్చేశాను.

రానందుకు పనిమనిషినీ, తీసుకురానందుకు నన్నూ కాసేపు తిట్టి పాపం మా ఆవిడే అన్ని పనులూ స్వయంగా చేసుకుంది. సరే ఈ గొడవంతా అయ్యేసరికి పద్దైంది. ఇంకా కథ రాసే టైమెక్కడుంది. నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఆఫీసుకు బయల్దేరాను.

రిక్షాలో ఆఫీసుకెళ్తూ కథ గురించి ఆలోచిద్దామనుకున్నాను. ఆ రిక్షావాడు ఎప్పుడూ నన్ను తీసుకెళ్ళేవాడే. నా కథ గురించిన ఆలోచనలు చెడగొట్టి వాడి కథ వాడు మొదలెట్టాడు చివరికి "దొరా ! వొంటి మీద సరైన గుడ్డ లేక పసిపిల్లలు చలికి అల్లాడిపోతున్నారు. మీ బిడ్డలు తొడిగి పారేసినయ్యేమన్నా చొక్కాలుంటే ఇప్పించండి" అన్నాడు. "సరే రేపు రా చూద్దాం" అన్నాను.

ఆఫీసులో కూర్చున్నంత సేపూ ఆలోచనంతా కథ మీదే వుంది. మా టైపిస్ట్ వెంకటలక్ష్మిని చూస్తే ఓ మంచి ఆలోచన తట్టింది. వెంకటలక్ష్మి బదులు కిరణ్మయి, రాగమయి ఇలాంటి పేరేదో పెట్టి వెంకటలక్ష్మికున్న ఎత్తు పళ్ళు లేకుండా, అతిలోక సౌందర్యవతియైన ఒక లేడీ టైపిస్ట్ పాత్రను సృష్టించి, లక్షాధికారి, యువకుడూ, అవివాహితుడూ, అయిన ఆఫీస్ మేనేజర్ పాత్ర ఒకటి కల్పించి, వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ నడిపితే - అబ్బో ! కావలసినన్ని అపార్థాలకీ, త్యాగాలకీ అవకాశం దొరుకుతుంది. ఈ కథ ఎలా అల్లడమా అని ఆలోచిస్తుండగానే సాయంత్రమైపోయింది. ఇంక ఇంటికెళ్ళి పోవచ్చు అనుకుంటూ వుండగా - మా ఆఫీసులో పని చేసే క్లర్క్ ఒకతను చచ్చిపోయాడని అతని ఇంటి దగ్గర్నించి కబురొచ్చింది. అంతా అక్కడికెళ్తూ, నన్ను కూడా రమ్మన్నారు. వెళ్ళక తప్పలేదు.

ఆ చచ్చిపోయిన క్లార్క్ రంగనాధమనీ, పది పన్నెండేళ్ళనుంచి పని చేస్తున్నాడు అయిదుగురు పిల్లలట. ఆ పిల్లల తల్లి గుండెలు బాదుకుంటూ ఒకటే ఏడుపు. ఎవరూ నా అన్నవాళ్ళు లేరట. అంత్యక్రియలకి కూడా డబ్బు లేదట. ఇంకేం చేస్తాం. మేమే తలో పదీ వేసుకుని శవాన్ని తీసికెళ్ళే ఏర్పాట్లు చేయించాం. కొంతమంది శ్మశానానికి కూడా వెళ్ళారు గానీ , నేను వెళ్ళలేదు. •అప్పటికే రాత్రి పద్దైంది. ఇంటి కొచ్చేశాను.

ఇంక ఆ రాత్రి కథ రాద్దామంటే మూడ్ రాలేదు. పొద్దున పనిమనిషి గొడవా, రిక్షావాడి గోడూ , క్లార్క్ రంగనాధం సంసారం - ఇవన్నీ చూశాకా - ఎంతసేపూ ఆ దర్జీ మనుషులూ,

ఆ దర్జీ బతుకులే గుర్తుకొస్తున్నాయి గాని కథకి కావలసిన అందమైన ఆలోచనలేవీ రావటం లేదు. ఇక ఇవ్వాళ లాభం లేదని పడుకున్నాను. ఎలాగైతేనేం అనుకున్న గడువులోగా కథ రాయలేకపోయాను.

అవాళ సాయంత్రం సుబ్బారావూ, ఆంజనేయులూ "'ధ రాశావా" అని అడిగారు. లేదని, ఈ రెండు రోజుల్లో జరిగిన గొడవంతా చెప్పాను. ఈ కారణాల వల్ల "మంచి కథ ఆలోచించే అవకాశం లేక పోయింది"అన్నాను. సుబ్బారావు నే చెప్పినదంతా శ్రద్ధగా విని - "ఒరే బుద్ధి గడ్డి తిని నిన్ను కథ|్రాయమన్నాం. నువ్వింక కథ|్రా యకు నువ్వు కథ|్రాయలేవు' ' అన్నాడు.

"నువ్వు చూచిన పనిమనిషి జీవితంలో, రంగనాథం సంసారంలో, నువ్వు విన్న రిక్షావాడి గోడులో గొప్ప కథలున్నాయి. నిజమైన కథలున్నాయి. నిజమైన కథలూ, జీవమున్న కథలూ బ్రతుకులోంచి పుడతాయ్. అంతేగాని మల్లెపూలలోంచి, వెన్నెల్లోంచి, మీ ఆవిడ కళ్ళల్లోంచి పుట్టవు. ఇవ్వాళ కావాల్సింది అమరప్రేమలూ, ప్రేమించినదాన్ని చివర్లో 'చెల్లీ' అని పిల్చేసి బావురుమని ఏడ్చే త్యాగాలూ కాదు. దేశంలో ఇవాళ్టి పరిస్థితుల్ని చూడు. కాస్త ఆలోచించు. నీ బ్రతుకు గురించే కాదు. నీ చుట్టూ వున్న వాళ్ళ బ్రతుకుల్ని కూడా పరిశీలించి చూడు నువ్వు చూసింది వ్రాయి మసిపూసి మారేడుకాయ అనకు నీకు తెలీంది రాయకు. మంచి కథ రాయాలంటే కథ రాయాలన్న దురద ఒక్కటే చాలదు. ఏ కథ రాయాలీ అన్నది కూడా తెలుసుకోవాలి. నీ కది తెలియదు. తెలీనప్పుడు రాయడం అనవసరం" అన్నాడు వాడే మళ్ళీ ఆంజనేయులు కూడా వాడన్నదాన్నే సమర్థించాడు.వాళ్లంటున్నదేమిటో నాకర్థం కాలేదు పనిమనిషి గురించీ, రిక్షావాడి గురించీ,గుమాస్తాగాడి గురించీ కథలు రాయమంటారేమిటి ? వాళ్ళతో వాదమెందుకుని వూరుకున్నాను

సరే వీళ్ళ పని ఇలా వుందా అని ఆ సాయంత్రం ఇంటికొచ్చి - బ్రహ్మాండమైన కథొకటి ఆలోచించాను. ఒకళ్ళు ప్రేమిస్తున్నట్టు ఒకళ్ళకి తెలీకుండా నలుగురు ప్రాణమిత్రులు - ఒకే అమ్మాయిని ప్రేమించేస్తారు. ఆఅమ్మాయి ఎవర్ని వరిస్తుందనేది చివరిదాకా తెలీదు. అబ్బ ! కావలసినంత డ్రామా క్రియేట్ చెయ్యొచ్చు. గొప్ప త్యాగాలు కూడా వుంటాయ్. ఇది చదివితే గాని అందరికీ బుద్ధి రాదు. అప్పుడే మొదలెట్టాను కూడా. రెండురోజుల్లో రాసి పారేస్తాను!

●

*(ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక -ఉగాది ప్రత్యేక సంచిక - 1972)*